క్లుప్తంగా

దరఖాస్తు గడువు పొడిగింపు

బైరెడ్డిపల్లి: ఏపీఆర్ బాలికల గురుకుల పాఠశాలలో 2025–2026వ విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతికి 80 సీట్లకు, 6,7,8వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు తేదీని మార్చి 31 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు పొడిగించినట్లు కమ్మనపల్లె గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఈఆర్ శోభ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినులు htt pr://aprr,apcfrr.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదలకు సరుకుల పంపిణీ



పేద ముస్లింలకు సరుకులు అందజేస్తున్న నిర్వాహకులు

కుప్పంరూరల్ : బీసీఎస్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు పేద ముస్లింలకు ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం 160 మంది పేద ముస్లింలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ శాంత, వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసుకోండి

రొంపిచెర్ల: నోషనల్ ఖాతాలో ఉన్న రైతుల భూములను రెగ్యులర్ చేసుకోవాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 3300 సర్వే నంబర్ల భూమి నోషనల్ ఖాతాలో ఉందన్నారు. దీని వలన రైతులకు వన్‌బీ రాదన్నారు. ఆన్‌లైన్‌లో తమ భూములను చూసుకోవడం కుదరదన్నారు. ఈ భూములకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న రైతు భరోసా పథకాలు వర్తించవని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకుని నోషనల్ ఖాతా భూముల రికార్డులను రెవెన్యూ అధికారులకు ఇచ్చి రెగ్యులర్ చేసుకోవాలని సూచించారు. లేకుంటే రైతులు నష్టపోతారని తెలిపారు. నోషనల్ ఖాతా రైతులకు నోటీసులు కూడా ఇస్తామని చెప్పారు. అలాగే అన్నదమ్ములకు భూ పంపిణీలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఫిర్యాదు చేస్తే వాటిని పరిష్కారిస్తామని ఆయన పేర్కొన్నారు.


బహిరంగ వేలం ప్రశాంతం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

సదుం: సదుం మేజర్ పంచాయతీ వనరుల బహిరంగ వేలం శనివారం ప్రశాంతంగా ముగిసింది. గతంలో నిర్వహించిన వేలంలో గందరగోళం నెలకొనడంతో అధికారులు వాయిదా వేశారు. ఈనేపథ్యంలో పోలీసుల పటిష్ట బందోబస్తు మధ్య సచివాలయం–2లో వేలం ముగించారు. వారపు సంత రూ.9.05 లక్షలు, కూరగాయల మార్కెట్ రూ.65 వేలు, ప్రైవేటు బస్టాండు రూ.77 వేలు, పూల మార్కెట్ రూ.1.18 లక్షలు పలికాయి. గత ఏడాదికంటే రూ.1.79 లక్షలు అదనంగా పంచాయతీకి ఆదాయం చేకూరినట్లు ఈఓ హసీనా తెలిపారు. డీఎల్‌పీఓ పార్వతి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సీఐ రాంభూపాల్, ఎస్ఐ షేక్ షావలి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, సర్పంచ్ ఉషారాణి, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్ పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సదుం: దళితుల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎస్ఎం పల్లె గ్రామస్తులు కోరారు. గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. శ్మశాన వాటిక ఏర్పాటు, అంబేడ్కర్ విగ్రహం కోసం స్థల మంజూరుకు వినతిపత్రాలు అందజేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. డీటీ కుమార్, దళిత సంఘం నాయకులు సీతాపతి, గిరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



జావేద్‌బాషా

వి.కోట: వి.కోట ఎస్ఐగా జావేద్‌బాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సీఐ సోమశేఖర్ సమక్షంలో ఆయన ఎస్ఐ బాధ్యతలు చేపట్టారు. గతంలో వి.కోటలో ఎస్ఐగా విధులు నిర్వహించిన బాబు కుప్పానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం నుంచి జావేద్‌బాషా ఎస్ఐగా బదిలీపై వచ్చారు. స్టేషన్ సిబ్బంది ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

ఎనిమిది మందిపై మద్యం కేసు

పుంగనూరు: పట్టణంలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన నలుగురిపైన, మద్యం తాగి వాహనాలు నడిపిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లోకేష్ శనివారం తెలిపారు. ఆయన విలేకరుతో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగంగా మద్యం తాగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 8 మందిపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

బాబోయ్ ఎండలు!

- పేదవారి ఊటీ పలమనేరులో 35 డిగ్రీల ఉష్ణోగ్రత
- ఏప్రిల్. మేలో మరింత ఎండలు
- జాగ్రత్తలు పాటించాల్సిందేనంటున్న వైద్యులు



పలమనేరు: పేదవాని ఊటీగా పేరొందిన పలమనేరులో వేసవి సెగలు భారీగా ఉన్నాయి. ప్రస్తుతం పలమనేరులో గరిష్టంగా పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీలకు పైగా చేరుకుంది. ఇక్కడే ఇలా ఉంటే ఇక ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతిలో ఉష్ణోగ్రతలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. గతంతో పోలిస్తే ఈ దఫా ఎండలు విపరీతంగా ఉంటాయని వాతారణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. మార్చిలోనే ఎండలు ఇలా ఉంటే వచ్చే ఏప్రిల్, మే నెలలో ఇంటి నుంచి కాలు బయటకు పెట్టాలంటే భయపడాల్సిందే. నిత్యం పనులకళ్లే వారు, వ్యవసాయకూలీలు, సంస్థల్లో పనిచేసే కార్మికులు తప్పని పరిస్థితుల్లో ఎండలోనే గడపాల్సి ఉంటుంది. తరచూ శరీరం నుంచి వెలువడే చెమటతో ఇబ్బందులు తప్పవు. ఇలా అధికంగా శరీరంలో నీరు కోల్పోవడంతో డీహైడ్రేషన్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎండ ఉపశమనం కోసం వైద్యులు కొన్ని చిట్కాలను సూచిస్తున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తపడదాం..

వేడి, సన్ స్ట్రోక్‌లతో శరీరం అధిక ఉష్ణోగ్రతలకు గురైనపుడు నాడీ వ్యవస్థపై ప్రభావం పడి మెటబాలిజంలో వేడి జనరేట్ అవుతుంది. దీని కారణంగా శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా 43 డిగ్రీలకు చేరుకుంటే వడదెబ్బ తప్పదు. ముఖ్యంగా రెండేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, క్రీడాకారులు, ఎండలో పనిచేసే వారు దీనికి గురయ్యే అవకాశాలెక్కువ. వడదెబ్బకు గురైనప్పుడు మొదట రోగి బట్టలు తీసి గాలి తగిలేవిధంగా చూడాలి. చల్లటి నీటితో శరీరమంతా తుడిచి చల్లని నీటితో తడిపిన బట్టను కప్పాలి. భుజాల కింద, గజ్జెలలో ఐస్ ముక్కలను ఉంచాలి. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. నివారణోపాయంగా తరచూ చల్లని నీటిని తాగుతూ ఉండాలి. మిట్ట మధ్యాహ్నం ఎండలో తిరగొద్దని సూచిస్తున్నారు.

వేసవి తాపానికి చిట్కాలు..

- తరచూ చన్నీళ్లతో స్నానం చేయాలి.
- చెమటను పీల్చే పౌడర్‌ను వినియోగించాలి.
- కాటన్, ఊల్స్ సాక్స్‌ను ధరించడం మంచిది.
- కాటన్ వస్త్రాలనే ధరించాలి.
- పడుకునే ముందు అరచేతులు, పాదాలకు యాంటీ రెస్పిరెంట్స్ రాసుకోవాలి
- శరీరానికి విశ్రాంతి అవసరం. యోగా, ధ్యానం చేయాలి.
- ఘాటైన వాసన ఉండే వెల్లుల్లి, ఉల్లిని తినడం తగ్గించాలి.
- నూనె పదార్థాలకు దూరంగా ఉండాలి.
- కాఫీ, టీలను తగ్గించి మజ్జిగ తాగాలి.
- శరీర మడతల భాగాల్లో పౌడర్, డియోడొరెంట్లను వాడాలి.
- నీటిలో నిమ్మకాయ పిండుకొని స్నానం చేయాలి.
- ఆకుకూరలు, సలాడ్స్ ఎక్కువగా తినాలి.



వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి.



ఎండలో వెళ్లే ముందు తలపై టోపీ గానీ, గొడుగు లేదా తలపాగా ధరించాలి. కళ్లకు నల్లటి కూలింగ్ గ్లాసెస్ పెట్టుకోవడం సురక్షితం. కూలి పనులు చేసే వారు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల దాకా ఎక్కువ ఎండలో ఉండరాదు. నీటితో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలాంటివి తీసుకోవాలి. రాగి జావా వేసవి తాపానికి ఎంతో విరుగుడు.

డా.యుగంధర్,
ఏరియా ఆస్పత్రి, పలమనేరు

చల్లటి పానీయాలు ఎంతో మేలు..



పది కప్పుల పుచ్చకాయల గుజ్జు, అల్లం ముక్కలు ఓ కప్పులో వేసి జ్యూస్‌గా తయారు చేసుకోవచ్చు. ద్రాక్ష, దానిమ్మల రసాలలో చెక్కెర వేసుకొని ఫ్రిడ్జ్‌లో కొంతసేపు ఉంచి సేవించాలి. ఇది డయేరియా నివారణకు ఉపయోగపడుతుంది. ముఖ్యంగా వడదెబ్బ తగలకుండా తరచూ మంచినీళ్లను తాగుతుండాలి.

డా.రజిని, ఆయుర్వేద వైద్యురాలు,
పలమనేరు



తాపీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

తొలి పండుగ ఉగాది



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: ఉగాది హిందూ నూతన సంవత్సర ప్రారంభాన్ని తీసుకొచ్చే తొలి పండగని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని రాగశ్రీ పాఠశాల ఆవరణలో కళాభారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ అధినేత రఘుపతి ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకుని కవి సమ్మేళం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్మన్‌ను ముందుగా స్వాగతించి ఘనంగా సత్కరించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన కవులను జెడ్పీ చైర్మన్ చేతుల మీదుగా సన్మానించారు. అలాగే జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు ఉపాపతినాయుడిని సన్మానించారు. కవులు, శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు, హెచ్ఎం రఘుపతి, హరికృష్ణారెడ్డి, కరణం విమల పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఇద్దరు ఎంపిక




సమృద్ధి, కీర్తన

పుంగనూరు: పట్టణంలోని శ్రీజ్ఞానాంభిక పాఠశాల విద్యార్థినులు ఇద్దరు సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ ఎల్లమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న ఎం కె.సమృద్ధి, సి.కీర్తన సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్‌లో అర్హత సాధించినట్లు తెలిపారు. కరస్పాండెంట్ వాసుదేవరెడ్డి విద్యార్థులను అభినందించారు.

ఐఆర్‌ఎంలో ముందస్తు ఉగాది సంబరాలు



ఉగాది సంబరాల్లో విద్యార్థులు, అధ్యాపకులు

కుప్పం: ఐఆర్‌ఎం కళాశాల ప్రాంగణంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ముందస్తు సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉగాది పండుగ నేపథ్యంలో శనివారం అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో తరలి వచ్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దయానిధి ఉగాది పచ్చడి ప్రతి ఒక్కరికీ అందించి, స్వీట్లు పంచిపెట్టారు.

మాగోడు పట్టించుకోండి!



పుంగనూరు ఎస్టీ హాస్టల్‌లో మురుగునీరు

- గిరిజన విద్యార్థినుల ఆక్రందన
- విజిలెన్స్ కమిటీ వచ్చినా ఫలితం శూన్యం
- కలెక్టర్ పట్టించుకోవాలంటూ వినతి
- గిరిజన విద్యార్థుల కష్టాలు తీరేదెన్నడు?



పుంగనూరు: గిరిజన బాలికల సమస్యలను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఈ విషయమై జిల్లా కలెక్టర్ స్పందించాలంటూ గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు విన్నవించుకుంటున్న సంఘటన పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్‌లో జరుగుతోంది. శనివారం సాక్షికి చిక్కిన ఫొటోలు మేరకు వివరాలిలా ఉన్నాయి. హాస్టల్‌లో 113 మంది గిరిజన బాలికలు చదువుకుంటున్నారు. ఇక్కడ పారిశుధ్యం, భోజన కార్యక్రమాలు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని డ్రైనేజ్ నీరు హాస్టల్‌లోకి వస్తున్నా ప్రిన్సిపల్ పట్టించుకోకపోవడంతో విద్యార్థినులు అనారోగ్యం భారిన పడుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు సైతం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పలుమార్లు వార్తలు ప్రచురించినా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు హాస్టల్‌ను సందర్శించినా మార్పులేకపోవడం గమనార్హం. తాజాగా జరుగుతున్న సంఘటనలు విద్యార్థినులను ఆందోళనలకు గురి చేస్తోంది. భోజనం మెనూ ప్రకారం పాటించకపోవడం, 113 మంది పిల్లలకు 13 లీటర్ల పాలు కొనుగోలు చేయాల్సి ఉండగా అందులో మూడు లీటర్ల పాలు మాత్రమే కొనుగోలు చేసి, ప్రభుత్వానికి పూర్తి లెక్కలు చూపుతున్నారని, ఇదోక ఉదాహరణ మాత్రమేనని విద్యార్థినులు వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, దీనిపై విచారణ చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినుల హాస్టల్‌లో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నేతలు

సదుం: మండలంలోని గొడ్లవారిపల్లెకు చెందిన రమణయ్య (61) అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలంలోని బసినికొండ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో ఆయన శుక్రవారం మృతిచెందారు. శనివారం యూటీఎఫ్ నేత రమణ, పలువురు ఉపాధ్యాయులు గొడ్లవారిపల్లెకు వెళ్లి భౌతికకాయానికి నివాళులర్పించారు.

కాబ్బల్లి రవీంద్రారెడ్డికి డాక్టరేట్



కాబ్బల్లి రవీంద్రారెడ్డికి అభినందనలు తెలుపుతున్న శ్రీవారి సేవకులు

పలమనేరు: మండలంలోని కాబ్బల్లి గ్రామానికి చెందిన శ్రీవారి సేవకుడు కాబ్బల్లి రవీంద్రారెడ్డికి ఆసియా కల్చరల్ అకాడమీ యూనివర్సిటీ తమిళనాడులోని హొసూరులో జరిగిన ఓ కార్యక్రమంలో సేవారంగానికి సంబంధించిన విభాగంలో గౌరవ డాక్టరేట్‌ను ఇటీవల ప్రదానం చేసింది. ఆయన తిరుమల నిత్యాన్న దాన పథకానికి దాతల సహకారంతో గత పదేళ్లుగా కూరగాయలు పంపుతున్నారు. దీంతో ఇక్కడి శ్రీవారి సేవకులు, కూరగాయల దాతలు, మండీ యజమానులు కిశోర్‌స్వామి, ఈశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, బాబు, జైసింగ్ అతనికి అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి

- జూనియర్ సివిల్ జడ్జి క్రిష్ణవంశి



మాట్లాడుతున్న జడ్జి క్రిష్ణవంశి

పెద్దపంజాణి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పుంగనూరు జూనియర్ సివిల్ జడ్జి క్రిష్ణవంశి అన్నారు. శనివారం మండలంలోని శ్రీరామాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించి ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా వినాలని చెప్పారు. అదే విధంగా బాగా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. విద్యార్థులు ముఖ్యంగా విద్యా హక్కు, పోక్సో, బాల్యవివాహాల నిరోధక చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగివుండాలన్నారు. ఆర్థిక స్థోమత లేని కక్షిదారులకు న్యాయస్థానం ద్వారా న్యాయవాదిని నియమించి కేసులు విచారణ జరిపిస్తామని జడ్జి తెలిపారు. హెచ్‌ఎం రమణప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ఆదినారాయణ

పలమనేరు: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఆదినారాయణ విద్యార్థులకు సూచించారు.. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టం గురించి వివరించారు. ఈ చట్టం 2012లో వచ్చినప్పటికీ లైంగిక వేధింపులు ఎందుకు అదుపులోకి రాలేదో తెలుసుకోవాలన్నారు. దేశంలో పెరుగు తున్న జనాభాలో 35శాతం మంది 18 ఏళ్లలోపు వారేనన్నారు. పిల్లలకు ఏదేనీ సమస్య రాగానే వెంటనే తల్లిదండ్రులు, బడిలో అయితే అక్కడి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎస్ఐ స్వర్ణతేజ, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు భాస్కర్, సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని, హెచ్‌ఎం కుప్పమ్మ పాల్గొన్నారు.

అభాగ్యుల కోసమే అమ్మబడి



అమ్మబడి ఊయల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి

పుంగనూరు: సమాజంలో అప్పుడే పుట్టిన పిల్లలను అనాథలుగా చేసి చెత్తకుప్పల్లో పడ వేయకుండా వారికి ఆస్పత్రి ఊయల్లో సౌకర్యం చేసి, పోషించే కార్యక్రమమే అభాగ్యులకు అమ్మబడి అని మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి తెలిపారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అయేషానస్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ మాట్లాడుతూ అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించే కార్యక్రమం ఎంతో మహాద్భాగ్యం అన్నారు. ప్రజలకు ఎక్కడ ఇలాంటి సంఘటనలు కనిపించినా ఆ పిల్లలను అమ్మబడి కార్యక్రమంలో చేర్పించాలని సూచించారు. నర్సింగ్ సూపరింటెండెంట్ భారతిదేవి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో ఎమ్మెల్యే

పలమనేరు: విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల వార్షికోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను ఎమ్మెల్యే అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ బెహరా శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువుల మేత బీడుకు నిప్పు

- ఇది ఇసుకాసురులపనేనని అనుమానం



పలమనేరు: పట్టణ సమీపంలోని జీఎల్ఎస్‌ఫామ్ వద్ద ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ, పశుపరిశోధన కేంద్రానికి సంబంధించిన పశువుల మేతబీడుకు గుర్తుతెలియని వ్యక్తులు శనివారం ఉదయం నిప్పు పెట్టారు. దీంతో మూడెకరాల్లోని పశుగ్రాసం, వెదురుచెట్లు కాలిపోయాయి. వీటి విలువ రూ.50 వేల దాకా ఉంటుందని తెలిసింది. ఇక్కడి ఖాళీ స్థలంలో పశుపరిశోధన కేంద్రంలోని పుంగనూరు పశువుల మేతకు వాడుకుంటున్నారు. పక్కనే కౌండిన్య నది ఉంది. దీంట్లోనుంచి ఇసుకాసురులు ఇసుకను తోడుతున్నారు. అక్కడ పశువుల కాపరులు పశువులను మేతకు వదిలి సంచరిస్తుంటారు. వీరి అడ్డు తొలగించుకోవాలంటే ఇదే మార్గమని అక్కడ ఇసుకతోడే వాళ్లే నిప్పు పెట్టి ఉంటారనే మాట స్థానికుల నుంచి వినిపిస్తోంది. ఏదేమైనా మూగజీవాలకు మేతలేకుండా పోయింది.

ఇటుక బట్టీలో అగ్నిప్రమాదం

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లెకు చెందిన శేషేగౌడు ఇటుకల బట్టీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మూడు పర్యాయాలు అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రెండు సార్లు ట్రాక్టర్‌కు నిప్పుపెట్టడంతో శేషేగౌడు ఇటుకల బట్టీకి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇటుకలను కాల్చడం కోసం తెచ్చిన కట్టెలకు పెట్రోలు పోసి నిప్పు పెట్టడంతో కాలి బూడిదయ్యాయి. సీసీ కెమెరా ఆధారాలతో శేషేగౌడు బైరెడ్డిపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పరుశురాముడు పేర్కొన్నారు.

విద్యార్థి అదృశ్యం

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు గ్రామానికి చెందిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన శనివారం వెలుగుచూసింది. గ్రామానికి చెందిన కృష్ణమూర్తి కుమారుడు మంజునాథ్(13) బంగారుపాళెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతూ అక్కడి ఎస్సీ హాస్టల్‌లో ఉండేవాడు. ఏదో విషయంగా తల్లిదండ్రులు తిట్టారని శుక్రవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయినట్టు కుటుంబీకులు తెలిపారు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

ఉగాదికి సర్వం సిద్ధం



పుంగనూరులో విక్రయానికి ఉంచిన పూలు, మామిడికాయలు, వేపపూత

పుంగనూరు: శ్రీవిశ్వావసు నామ నూతన సంవత్సర ఉగాది పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించుకునేందుకు తెలుగు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ మేరకు అన్ని ఆలయాల్లో ఉగాది ఆస్థానం నిర్వహించేందుకు అర్చకులు, పండితులు సిద్ధం చేశారు. అలాగే ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు హిందువులు సిద్ధమయ్యారు. ప్రతి ఇంటా ఉగాది పచ్చళ్లు పూజలు చేసి స్వీకరించేందుకు పచ్చిమామిడికాయలు, వేపపూత, మామిడి ఆకులను శనివారం కొనుగోలు చేశారు. అలాగే ఇళ్లను పూలతో అలంకరించారు. ఉగాది పండుగ సందర్భంగా హిందువులు తమ కుటుంబాల్లో మరణించిన సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి పూజలు చేయడం ఆనవాయితీ. అలాగే పంట పొలాలు, బోరు బావులకు పండుగ సందర్భంగా పూజలు చేస్తారు. నూతన సంవత్సరంలో తమ కష్టాలు తొలగిపోవాలని ప్రజలు ఉగాది ఏర్పాట్లలో నిమగ్నమైయ్యారు.

దుకాణాల్లో తనిఖీలు



దుకాణంలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

పలమనేరు: పట్టణంలో నిషేధిత గుట్కాను విక్రయిస్తున్న పలు దుకాణాలపై స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి శనివారం దాడులు చేశారు. ఈ సందర్భంగా కూల్‌డ్రింక్ షాపుల్లో అమ్మకాలు చేసున్న గుట్కాలను స్వాధీనం చేసుకున్నారు. వీరికి రూ.1500 జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు.